క్లుప్తంగా

కిటకిటలాడిన వారపు సంత



మండల కేంద్రంలోని వారపు సంత

మక్కువ: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన వారపు సంత కిటకిటలాడింది. సంక్రాంతి పండగకు ముందు సంత జరగడంతో గిరిశిఖర గ్రామాల నుంచి గిరిజనులు అధిక సంఖ్యలో సంతకు చేరుకుని అటవీ ఉత్పత్తులను విక్రయించడంతో పాటు వారికి కావాల్సిన నిత్యావసర సరుకులు కొనుగోలు చేశారు. అలాగే మైదాన ప్రాంతాల నుంచి ప్రజలు సంతకు చేరుకోవడంతో సంత కళకళలాడింది.

బలిజిపేటలో ట్రాఫిక్ సమస్య



ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య

బలిజిపేట: బలిజిపేట ప్రధాన రహదారిలో ఉన్నత పాఠశాల నుంచి చిలకలపల్లి రహదారిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. పండగ రోజులు కావడంతో జనసంచారం ఎక్కువవై వాహనాల రాకపోకలు అదే మార్గం గుండా వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ముఖ్యంగా మిల్లులకు ధాన్యం తరలించే వాహనాలు, పెద్ద లారీలు ఇదే రహదారిపై నుంచి రావడంతో పక్కకు తప్పుకోవడానికి పాదచారులకు మార్గం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బజారులో రెండు పెద్ద పెద్ద వాహనాలు ఎదురెదురుగా వస్తే తప్పుకునేందుకు వీలులేకుండా పోతోందని దీనివల్ల ఎంతో ఇబ్బందిగా ఉంటోందని ప్రజలు చెబుతున్నారు. పండగ రోజుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీస్‌శాఖ చూడాలని కోరుతున్నారు.

ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్‌గా గౌరి నియామకం



ఎస్.గౌరికి నియామక ఉత్తర్వుల కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురం గ్రామ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమితురాలైన కలిశెట్టి గౌరి వేతనదారులకు ఉపాధి పనులు కల్పించి ప్రజల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమెకు ఫీల్డ్ అసిస్టెంట్ నియామక ఉత్తర్వుల కాపీని సర్పంచ్ టి.సత్యవతి, ఎంపీటీసీ టి.పార్వతమ్మల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ చప్ప సురేష్‌కుమార్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు టి.గంగునాయుడు, టి.వెంకటరమణ పాల్గొన్నారు.

యూనిఫారాలు పంపిణీ



యూనిఫారాలు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

సాలూరు: మున్సిపాలిటీలోని ప్రజారోగ్య, ప్రజారోగ్యేతర, పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ యూనిఫారాలు, చీరలు, జాకెట్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సంక్రాంతి పండగ నేపథ్యంలో యూనిఫారాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఉద్యోగులు, కార్మికులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ దేవానంద్ రెడ్డి

పార్వతీపురంటౌన్: పదోతరగతి పరీక్షల డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ దేవానంద్ రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లాలోని పరీక్షా కేంద్రాలు, మూల్యాంకన కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఈ సందర్భంగా ఆదేశించారు. ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని స్పష్టం చేశారు. పరీక్షాకేంద్రాల వద్ద విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్, పరీక్షల సహాయ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎస్ఈ, డీఈ, ఏఈలతో కలిసి క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల ప్రగతిపై ఆరా తీశారు. సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చిన అంశాలు ఇంతవరకు నియోజకవర్గం పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఏ పనులు పూర్తయ్యాయి? మిగిలినవి ఏ దశలో కొనసాగుతున్నాయి? ఇప్పటికీ ప్రారంభం కానీ అభివృద్ధి పనులేవి అన్న నివేదికను రెండు రోజుల వ్యవధిలో తన ముందుంచాలని ఆదేశించారు. ఇంతవరకు నియోజకవర్గంలో చేపట్టిన పనులన్నింటికీ బిల్లులు చెల్లింపులు అయ్యాయా, లేదా? ఒకవేళ ఇంకా అవకపోతే చెల్లింపుల విషయంలో తగిన చర్యలు యుద్ధ ప్రాతిపదికన తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

మరికొద్ది రోజుల్లో సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అభివృద్ధి పనుల వేగవంతంపై ప్రత్యేక దృష్టి సారించి, అదేవిధంగా బిల్లుల విషయంపై నిబద్ధతతో వ్యవహరించాలని, సకాలంలో చెల్లింపులు జరగలేదన్నమాట తనకు వినిపించ కూడదని, అందుకు మీరంతా క్షేత్రస్థాయిలో కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుని చెల్లింపుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ జిల్లా అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్

పార్వతీపురంటౌన్: జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలని అందుకు గాను ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో కృషిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రెయిన్ ఫారెస్టు అలయెన్స్ ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీ వారితో సస్టైనబుల్ అగ్రికల్చర్ అండ్ బయో డయవైవర్సిటీ అక్రాస్ ల్యాండ్స్ ల్యాండ్‌స్కేప్స్ ప్రాజెక్టుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, అడవులు, అక్రమణ, వ్యవసాయ క్షేత్రాల విస్తరణతో జీవవైవిధ్యం దెబ్బతింటుందన్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడే విధంగా సమీకృత వ్యవసాయ విధానాన్ని చేపట్టాలని, అందుకు స్థానిక ప్రజలకు ప్రోత్సాహం అందించాలని చెప్పారు. సమీకృత వ్యవసాయ విధానంతో సామాజిక ఆర్థికాభివృద్ధి కూడా సాధించే విధంగా ప్రణాళికలను రూపొందించాలని వ్యవసాయ అనుబంధ శాఖలకు సూచించారు. రాష్ట్రప్రభుత్వం, రైతు సాధికార సంస్థ, స్థానిక పౌర సమాజ సంస్థల భాగస్వామ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రెయిన్ ఫారెస్టు అలయన్స్ లీడ్ ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం ఇంటరేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అమలు చేసే ఏజెన్సీలన్నీ వారితో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రాజెక్టును విజయవంతం చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు వివరాలను రెయిన్‌ఫారెస్టు అలయన్ సంస్థ కన్సల్టెంట్ కె. శ్రీధర్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఎం పి.షణ్ముఖరాజు, జిల్లా ఉద్యాన అధికారి కె.వరప్రసాద్, మత్స్యశాఖ, వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు ప్రాధాన్యం

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎస్వీ రమణ అన్నారు. ఈ మేరకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి పావని ఆధ్వర్యంలో శుక్రవారం సీతానగరం పీహెచ్‌సీ పరిధిలోఉన్న చిన భోగిలి, లచ్చయ్యపేట, బగ్గందొర వలస, లచ్చయ్యపేట తదితరగ్రామాల్లో హెల్త్ సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది నిర్వహించిన ఫ్రైడే డ్రైడే సేవాకార్యక్రమాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో చిన భోగిలి సర్పంచ్ కె.రాధ, హెల్త్ సూపర్‌వైజర్లు శర్మ,



చినభోగిలిలో దోమల నివారణమందు పిచికారీ చేయడాన్ని పరిశీలిస్తున్న సీహెచ్‌ఓ ఎస్వీ రమణ

పంచాయతీ కార్యదర్శులు, గ్రామవలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పార్వతీపురానికి గుర్తింపు

- జోనల్ ర్యాంకింగ్‌లో 100వ స్థానం
- జాతీయ స్థాయిలో 1830స్థానం
- రాష్ట్రస్థాయి ర్యాంకింగ్‌లో 37వ స్థానం



మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురంటౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పార్వతీపురం మున్సిపాల్టీకి మంచి గుర్తింపు వచ్చిందని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో పార్వతీపురం మున్సిపాల్టీ మంచి స్థానం సంపాదించడం గర్వంగా ఉందన్నారు. జాతీయస్థాయి ర్యాంకింగ్‌లో పార్వతీపురం మున్సిపాల్టీకి 1830 ర్యాంకు, జోనల్ స్థాయిలో 100వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 37వ ర్యాంకు దక్కించుకుందని తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణకు సంబంధించి 100శాతం, చెత్తను రీసైకిల్ చేయడంలో 74 శాతం, వేస్ట్ జనరేషన్ కేటగిరీలో 12శాతం, నివాస స్థలాల పరిశుభ్రతలో 100శాతం, నీటి సరఫరా చేసే ప్రాంతాల పరిశుభ్రతలో 100శాతం, మార్కెట్‌లు, పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రతలో 100శాతంతో పార్వతీపురం మున్సిపాల్టీకి మంచి ర్యాంకులు వచ్చాయని తెలిపారు. పట్టణ ప్రజలు, మున్సిపల్ సిబ్బంది సహకారంతో మంచి ర్యాంకులు సాధించామన్నారు. పార్వతీపురం పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచి రానున్న రోజుల్లో మరిన్ని ర్యాంకులు సాధించేలా కృషిచేస్తామని చెప్పారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన పాడేరు ఎమ్మెల్యే



ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాలూరు: పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను శుక్రవారం అతని స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. భాగ్యలక్ష్మిని ఇటీవల అరకు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో భాగ్యలక్ష్మికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

పండగ వేళలో జాగ్రత్త

- గ్రామాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారమివ్వాలి
- సీఐ కృష్ణారావు



పార్వతీపురంటౌన్: సంక్రాంతి పండగ సందర్భంగా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు హితవు పలికారు. సంక్రాంతి పండగ సందర్భంగా పట్టణంలో ఇళ్లను ఖాళీచేసి వేరే గ్రామాలకు వెళ్లే కుటుంబాలు పోలీసువారికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ సంక్రాంతి పండగను పురస్కరించుకుని అపరిచితులు సంచరించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా పండగను పురస్కరించుకుని ఇళ్లకు తాళాలువేసి బయటకు వెళ్లేవారంతా పోలీసులకు సమాచారం అందిస్తే తమ దృష్టి ఆ ఇళ్లపై పెడతామన్నారు. అలాగే పండగను పురస్కరించుకుని పేకాట, కోడిపందాలను నిషేధించినట్లు చెప్పారు. ఎక్కడైనా కోడిపందాలు, పొట్టేలు పందాలు నిర్వహించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండగల్లో పట్టణంలో, పరిసర ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, మద్యం తాగి అల్లర్లకు పాల్పడితే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి పాతబస్టాండ్ వరకు రద్దీ దృష్ట్యా వాహనాలను అనుమతించడం లేదని వాహన చోదకులు గమనించి పోలీసు వారికి సహకరించాలని కోరారు.

2,222 మందికి వైద్య సేవలు

పార్వతీపురంటౌన్: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందించడమే ధ్యేయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. జిల్లాలో శుక్రవారం 8 చోట్ల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్యశిబిరాలను ఆయన పరిశీలించారు. మొత్తం 2,222 మందికి వైద్య సేవలు అందించామన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



సీతానగరం: స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న యువజన సంఘం సభ్యులు



సీతానగరం: స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో యువజన సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి.ఈ మేరకు స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సీతానగరం మండలంలోని బుడ్డిపేటలో మదర్ థెరిసా యువజన సేవాసంఘం ప్రతినిధులు ఎం.వెంకటరమణ, వై శంకరరావు మాట్లాడుతూ భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. స్వామి వివేకానంద సమాజానికి అందించిన సేవలను యువతీయువకులు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు నడవాలని హితవు పలికారు.

కార్యక్రమంలో భాగంగా వివేకానందుని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు ఎం. చిన్నంనాయుడు,కె రామకృష్ణ, రాజశేఖర్, శివ, వంశీ, ఎం.సాయి షణ్ముఖచంద్ర సాయి పాల్గొన్నారు. అలాగే బగ్గందొరవలసలోని కృషి విద్యాలయంలో కరస్పాండెంట్ డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వామి వివేకానంద జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేదల ప్రాణాలకు పెద్దదిక్కు



ఆరోగ్య సురక్ష–2 శిబిరంలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: జగనన్న పాలనలో ఆరోగ్య సురక్ష పథకం పేదల ప్రాణాలకు పెద్దదిక్కుగా ఉందని ఎంపీపీ నాగమణి అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పెదపెంకిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ సంపూర్ణంగా వైద్య పరీక్షలు నిర్వహించి మంచి వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రతి కౌంటర్ వద్ద రోగులకు ఎటువంటి వైద్యసేవలు అందుతున్నాయి? ఏఏ రకాల మందులు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోందని ఇంటివద్దనే వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యంగా ప్రజలు భావించి ఇటువంటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, ఎంపీడీఓ విజయలక్ష్మి, వ్యవసాయ సలహా సంఘం మండల అధ్యక్షుడు గంగయ్య, కె.వెంకటరమణ, పోలినాయుడు మాస్టారు, జి.అప్పలనాయుడు మాస్టారు, సీహెచ్.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటలపై దృష్టిసారించండి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: రబీ సీజన్ పంటలపై దృష్టిసారించాలని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ సూచించారు. బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు పండిస్తున్న పంటలకు ఈ–క్రాప్ పరిశీలించి రైతులతో బయోమెట్రిక్ వేయించాలని కోరారు. రబీకి అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ సిబ్బందికి సూచించారు. ఏపీ సీడ్స్‌ద్వారా పురుగు మందులు తెప్పించి అందుబాటులో ఉంచాలన్నారు. దీనిపై ఏఓ శ్రావణ్ మాట్లాడుతూ అన్ని మందులు, ఎరువులు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. పశు సంవర్థక శాఖ అధికారులు మాట్లాడుతూ పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

108 పాత్రలతో వేణుగోపాలస్వామికి ప్రసాదాలు



తిరువీధిలో వేణుగోపాలస్వామి



స్వామివారికి 108 పాత్రలతో సమర్పించిన నైవేద్యం

సీతానగరం: మండలంలోని వివిధ గ్రామాల్లో ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం గోవింద మాలాధారణ చేసిన భక్తులు నగర సంకీర్తన, మేల్కొల్పులు, గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోవింద భక్తులు సీతానగరం మండలకేంద్రంలోని సువర్ణముఖినదిలో సంధ్యావందనం చేసి అనంతరం వేణుగోపాలస్వామి, రాములవారి ఆలయాల్లో పూజలు చేసి, నగర సంకీర్తనలు చేపట్టారు. అలాగే వేణుగోపాల స్వామి వారిని పల్లకీలో ఊరేగించి తిరువీధి చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు తయారుచేసిన ప్రసాదాన్ని స్వామివారికి 108 పాత్రలతో స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

క్రమం తప్పకుండా డ్రైడే నిర్వహించాలి



డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: దోమల వ్యాప్తిని నిర్మూలించడమే ధ్యేయంగా క్రమం తప్పకుండా డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన హిందూపురం, గంగాపురం గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాలను శుక్రవారం పరిశీలించారు. గ్రామవీధుల్లో, ఇంటి పరిసరాలు పరిశీలిస్తూ దోమలు వృద్ధిచెందే పరిసరాలపై దృష్టిసారించారు. నీరు నిల్వఉన్న కుండీలు, రుబ్బురోళ్లు, టైర్లు మొదలైన వాటిలో దోమల లార్వా ఉనికి నిశితంగా పరిశీలించి నీటినిల్వలను పారబోయించారు. నీరు ఎక్కువ కాలం నిల్వఉంచరాదని, అప్పుడప్పుడు ఎండలో ఆరబెట్టాలని అక్కడి ప్రజలను సూచించారు. నీరు నిల్వ ఉన్న చోట దోమల ఉత్పత్తి, వ్యాప్తికి ప్రధాన కారకాలుగా ఉంటాయని ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇందుకోసమే డ్రైడే కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. వైద్యసిబ్బంది, తదితర శాఖల సిబ్బంది సమన్వయంతో డ్రైడే కార్యక్రమాలు పక్కాగా నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు అక్కడి ప్రజలు, సిబ్బందితో మాట్లాడి గ్రామంలో ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వెంట ఏఎంఓ సూర్యనారాయణ, ఏఎన్ఎం సరోజిని తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలుప్పిలో 12వ ప్రగతి యువజనోత్సవాలు



మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ ఎం.డి అజీర్

సీతానగరం: సమాజసేవే పరమావధిగా 12 సంవత్సరాలుగా గెడ్డలుప్పి గ్రామంలో స్వచ్ఛందంగా సేవలందిస్తున్న ప్రగతి యువజన సంఘాన్ని బొబ్బిలి ట్రైనీ డీఎస్పీ ఎం.డి అజీర్ ప్రశంసించారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం గెడ్డలుప్పిలో ప్రగతి యువజన సేవాసంఘం ఏర్పాటు చేసిన వార్షికోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన స్వామి వివేకానంద సమాజానికి చేసిన సేవలను కొనియాడుతూనే ప్రగతి యువజన సేవాసంఘం సభ్యులు అందిస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని మరికొన్నిగ్రామాల యువతీ యవకులు సన్మార్గంలో నడవడానికి, ప్రజలను చైతన్య పర్చడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో కోలాటం ప్రదర్శన చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లుతిరుపతిరావు, ఎంపీటీసీ కె.సత్యనారాయణ, అభిమాని ఫౌండేషన్ అధినేత రాజగోపాలనాయుడు, రక్తదాత బి.రామకృష్ణ, ప్రగతి యువజన సేవాసంఘం ప్రతినిధులు కిశోర్, సింహాచలం, పీఏసీఎస్ చైర్మన్ కె.శ్రీరాములు పాల్గొన్నారు.